

# గాడిద పాలు 20 ఎంఎల్ రూ.100

ప్రజాశక్తి-నార్పల

గాడిద పాలు 20 మిల్లీలీటర్లు రూ.100కు విక్రయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదుగురు మహిళలు ఐదు గాడిదలను తీసుకొచ్చి నార్పలలో ఇళ్లిళ్లూ తిరుగుతూ గాడిద పాలు విక్రయిస్తున్నారు. గాడిద పాలు తాగితే చిన్న పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందనేది చాలామంది నమ్మకం. అయితే ఈ మధ్యకాలంలో గాడిదలు కరువైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదురుగు మహిళలు ఒక్కొక్క గాడిదకు సుమారు రూ.50వేలు వెచ్చించి ఐదు గాడిదలు తీసుకుని నార్పలకు విచ్చి ఇంటింటికీ వెళ్లి అవసరమైన వారికి పాలు విక్రయిస్తున్నారు.



నార్పల వీధుల్లో గాడిదను పట్టుకుని వెళ్తున్న మహిళ

# వానాకాలంలో ఎండలు




## ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
## ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాభావం
## ఆందోళనలో రైతులు

**జూన్ వచ్చిందంటే వానలు మొదలవుతాయి. దీంతో వర్షకాలం మొదలైనట్టే. రుతుపవనాలు వచ్చేస్తాయి. కాని ఈసారి ఇప్పటికీ రుతుపవనాలు జిల్లాకు చేరుకోలేదు. ఇప్పటికీ ఎండలు దంచేస్తున్నాయి. మే నెలలో లాగానే ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటోంది. దీంతో జనం ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఒకవైపు జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమవుతుంది. రైతులు దుక్కులు దున్నుకుని విత్తనం విత్తుకునేందుకు సమయత్తమయ్యే సమయం. కాని ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.**

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. సాధారణం కంటే ఐదు శాతం నుంచి ఏడు శాతంలోపు ఎండలు అధికంగా ఉన్నాయి. మరోరెండు రోజులు ఇలాగే కొనసాగే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. అనంతపురం జిల్లాలో 31 మండలాలున్నాయి. ఇందులో శుక్రవారం ఐదు మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంది. శనివారం ఏకంగా 11 మండలాలు సాధారణం కంటే అధికంగా ఎండ తీవ్రత ఉంది. ఇక 18వ తేదీ ఎండ తీవ్రత తగ్గే అవకాశాలున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక సత్యసాయి జిల్లాలో 32 మండలాలున్నాయి. శుక్రవారం అంతటా సాధారణ వాతావరణమే నెలకొంది. శనివారం మాత్రం ఐదు మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంది.18వ తేదీన అన్ని మండలాల్లోనూ సాధారణ వాతావరణమే కొనసాగనుంది.



**సీజన్ ప్రారంభంలోనే వర్షాభావం**

సీజన్ ప్రారంభంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాల్లో సాధారణ వర్షపాతం 46.7 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటిదాకా 30.6 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. దీన్ని బట్టి చూస్తే 34.5 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. సత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. 32 మండలాల్లో సాధారణ వర్షపాతం 51.6 మిల్లిమీటర్లకుగానూ 27.2 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయింది. దీన్ని బట్టి చూస్తే 47.3 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. అనంతపురం జిల్లాలో 12 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఎనిమిది మండలాల్లో వర్షాభావం నెలకొంది. సత్యసాయి జిల్లాలో 12 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. పది మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సీజన్ ప్రారంభంలోనే ఇటువంటి పరిస్థితులు నెలకొనడంతో పంటలు ప్రభావం చూపనుంది. మే నెలలో మంచి వర్షాలు పడినప్పటికీ జూన్ నెలలో సీజన్ ప్రారంభం నుంచి పడకపోవడంతో రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితులు కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



అవార్డు అందుకుంటున్న ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరక్టర్ డాక్టర్ మల్లారెడ్డి

# యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు జాతీయ జలఅవార్డు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు "4వ జాతీయ జల అవార్డు" కైవసం చేసుకుంది. జిల్లాలో జల వనరుల అభివృద్ధి, మెట్ట వ్యవసాయంలో కరువు నుంచి రక్షించడానికి ఫారం పాండ్స్, రక్షకతడి, మిశ్రమ పంటలు, అంతర పంటలు తదితరవి విస్తృతంగా అమలు చేస్తూ విశేష కృషి చేసినందుకు యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు 4వ జాతీయ జల అవార్డు వరించింది. శనివారం భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 4వ జాతీయ జల అవార్డుల ప్రధానోత్సవం న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జాతీయ స్థాయిలో జల వనరుల అభివృద్ధి, నిర్వహణ కొరకు విశేష కృషి చేస్తున్న సంస్థలకు వివిధ కేటగిరీల క్రింద నేషనల్ వాటర్ అవార్డులు ప్రధానం చేశారు. జిల్లాలోని యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సంస్థకు ఉత్తమ ఎన్‌జిఒ కేటగిరిలో స్పెషల్ కన్సోలేషన్ అవార్డును ప్రదానం చేశారు. భారత జలశక్తి మంత్రిత్వ శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ చేతుల మీదుగా ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవి.మల్లారెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ జాతీయ అవార్డులో భాగంగా ప్రశంసాపత్రం, నగదు పురస్కారం, ట్రోఫీని ప్రధానం చేశారు. 40 సంవత్సరాలుగా ఎఎఫ్ ఎకాలజీ సంస్థ కరువు పీడిత అనంతపురం జిల్లాలో వర్షాధార వ్యవసాయాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టింది. భూసార, నీటి సంరక్షణ, కరువు నివారణ, సుస్థిర వ్యవసాయం మొదలగు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఎన్జీవో కేటగిరీలో ఈ అవార్డును ఎంపిక చేశారు. ఈ సందర్భముగా డాక్టర్ వైవి. మల్లారెడ్డి మాట్లాడుతూ సంస్థ పనిని గుర్తించి, కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విజయం సంస్థ సిబ్బంది, రైతుల ఉమ్మడి కృషి వల్లనే వచ్చినదని తెలిపారు.



ప్రతిభా విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

# విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

## కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. 10, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కింద నగదు పురస్కారాలతో సన్మానించారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత చదువులకు వెళుతున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆణిముత్యాల పురస్కారాలు ప్రకటించిందన్నారు. ఇప్పటికే పాఠశాల, నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం చేపట్టగా, ప్రస్తుతం జిల్లాస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి పారితోషకం అందిస్తూ అభినందిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలే మారాయని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కాకూడదని ప్రభుత్వం అమ్మ ఒడి, విద్య కానుక, విద్యా దీవెన లాంటి పథకాలు ప్రవేశపెట్టడమే గాక, మంచి విద్య బోధన చేస్తుండడంతో చాలామంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు వస్తున్నారన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ, జిల్లాలో వెనుకబడిన రొళ్ల మండలానికి చెందిన విద్యార్థులు 590 కి పైగా మార్కులు తెచ్చుకోవడం గర్వకారణమన్నారు. జిల్లాలో మొత్తం 1026 మంది విద్యార్థులకు ఆణిముత్యాలు కింద రూ. 47.15 లక్షల నగదు పురస్కారాలను కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల స్థాయిలో 926 మంది, నియోజకవర్గ స్థాయిలో 47, జిల్లా స్థాయిలో 53 మంది ఎంపిక కాగా వారికి నగదుతో పాటు మెడల్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, ఎంపీపీ ఎవి రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, ఇన్‌ఛార్జి డిఇఒ రంగస్వామి, ఎంఇఒ వెంకటరమణ, కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోలేని ప్రభుత్వం

## రైతు సంఘం నాయకులు బడాసుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

గతేడాది నవంబర్, డిసెంబర్‌లో అధిక వర్షాల వల్ల, 2023 ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం నాయకులు సుబ్బిరెడ్డి విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించడం తగదన్నారు. జాతీయ రహదారులు, రైల్వే, గ్యాస్ పైప్ లైన్లు, సాగునీటి కాలువలు, పారిశ్రామిక కారిడార్లు, సోలార్ ప్రాజెక్టు, తదితర వాటికి భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు నిధులు, పట్టు రైతులకు ఇన్సెంటివ్, మల్బరీ షెడ్లకు రుణ పరిమితి 90% సబ్సిడీ, పాడి రైతులకు విరివిగా రుణాలు, లీటర్ పాలుకు రూ. 4 ఇన్సెంటివ్, పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఏడి సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# కొంకల్లు గ్రానెట్ క్వారీ వివాదాస్పదం



క్వారీ వద్ద పనులను అడ్డుకుంటున్న బాధితులు

## హక్కుపై కోడలు మోసం చేసిందని వృద్ధదంపతుల ఆవేదన
## పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదంటున్న బాధితులు

ప్రజాశక్తి గుడిబండ

మండల పరిధిలోని కొంకల్లు సమీపంలో 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన గ్రానెట్ క్వారీ హక్కులపై మామ, కోడలు మధ్య వివాదం నెలకొంది. తమ కుమారుడు మృతిచెందడంతో అతని పేరు మీద ఉన్న క్వారీని తమకు తెలియకుండా తమ కోడలు తన పేర రాయించుకుని వృద్ధులైన తమను మోసం చేసిందని వృద్ధదంపతులు వాపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు...

తమిళనాడు రాష్ట్రానికి చెందిన మునిస్వామి, తమిళమణి దంపతుల తనయుడు గాంధీదాస్ అనే వ్యక్తి పేరిట మండల పరిధిలోని కొంకల్లు క్రాస్ సమీపంలో పది సంవత్సరాల క్రితం దాదాపు 12 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన బండగుట్టను ప్రభుత్వం 20 ఏళ్ల పాటు రాయితీలు కట్టించుకుని లీజుకు ఇచ్చింది. ఆ స్థలంలో గ్రానైట్‌రాయి తవ్వకం కోసం మైన్స్ అధికారుల నుంచి అనుమతి పొంది, అప్పటినుండి గ్రానైట్ తవ్వకాన్ని ప్రారంభించారు. ఈనేపథ్యంలో గాంధీదాస్ స్నేహితులు తమకు కూడా క్వారీలో వాటా ఇవ్వాలని కోరగా తమిళనాడుకు కర్నాటకకు చెందిన తన స్నేహితులకు కొన్నేళ్లపాటు లీజుకు ఇచ్చి అగ్రిమెంట్లు రాయించుకున్నాడు. అయితే రెండేళ్ల క్రితం కరోనా సమయంలో గాంధీదాస్ కోవిడ్‌తో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో గాంధీదాస్ పేరు మీద క్వారీని హక్కును ఆయన భార్య వారి అత్తమామలకు తెలియకుండా అనంతపురం మైన్స్ జిల్లా కార్యాలయానికి వెళ్లి తన పేరిట చేయించుకుంది. తిరిగి పాత వారికే లీజుకు ఇచ్చింది. ఒక్కొక్కరి నుంచి ఐదు కోట్ల రూపాయలను ఇప్పించుకుని ఆ వ్యక్తులకు లీజికిస్తూ అగ్రిమెంట్లు రాయించుకుందని గాంధీదాస్ తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పుడు తాముకష్టపడి సంపాదించిన డబ్బులతో క్వారీని లీజుకు తీసుకొని తనచిన్న కుమారుడు గాంధీ దాస్ పేరిట చేయించామని తన కుమారుడు మృతి చెందిన అనంతరం తన కోడలు మల్లేశ్వరి తమకు తెలియకుండా ఆమె పేరిట క్వారీ చేయించుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను అప్పుల ఊబిలోకి నెట్టి తమను వీధిపాలు చేయడం ఎంతవరకు న్యాయమని గాంధీదాస్ తల్లిదండ్రులు తమ కోడలిని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై గుడిబండ, మడకశిర పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో పోలీసులు క్వారీ యజమానులతో పాటు అక్కడ పనిచేస్తున్న కార్మికులను కూడా బైండోవర్ చేసి ఇక మీదట ఇక్కడ పనులు చేయకూడదని అప్పట్లో హెచ్చరించారు. ఆరు నెలల పాటు ఎలాంటి పనులు చేయకుండా మిన్నకుండిపోయిన లీజుదారులు 15 రోజుల క్రితం తిరిగి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న గాంధీదాస్ తల్లిదండ్రులు పనులు అడ్డుకోవడానికి వెళితే తమిళనాడుకు చెందిన లీజు యజమాని స్థానికంగా ఉన్న కొంతమందితో కలిసి గాంధీదాస్ తల్లిదండ్రులపై దౌర్జన్యం చేశాడు. ఈఘటనలో గాయపడ్డ గాంధీదాస్ తండ్రి గుడిబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తిరిగి శనివారం క్వారీ లీజు దారులు పనులు ప్రారంభించగా విషయం తెలుసుకున్న గాంధీదాస్ తల్లిదండ్రులు పనులు అడ్డుకున్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వృద్ధదంపతులు కోరుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము సంపాదించిన డబ్బంతా క్వారీపై పెట్టామని అనుకోకుండా తమ కుమారుడు మృతిచెందడంతో అప్పులవారి బెడద ఎక్కువైందని వాపోయారు, క్వారీ విషయంలో తమ కోడలు తమకు ఎలాంటి సంబంధం లేదని తన భర్త పేరిట ఉన్న క్వారీ తనపేరుమీద మార్చుకున్నానని చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు ఆత్మహత్య శరణ్యం అని కన్నీటిపర్యంతం అయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

# హంద్రీనీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## జలసాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి

ప్రజాశక్తి - మడకశిర రూరల్



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న నాయకులు

నియోజకవర్గం వ్యాప్తంగా హంద్రీనీవా కాలువ పనులను పూర్తి చేయాలని జల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కదిరేపల్లి సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను జలసాధన సమితి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ మడకశిర, అగలి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల్లో 165 చెరువులకు, 13,500 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల న్నారు. అలాగే గుడిబండ, రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మించాలన్నారు. పెనుకొండ నుంచి మడకశిరకి బైపాస్ కెనాల్ త్వరితగతిన ప్రారంభించాలని, మడకశిర బ్రాంచ్ కెనాల్, హంద్రీనీ వా మెయిన్ కాలువ వెడల్పు చేయాలని, హంద్రీనీవా ప్రాజెక్టుకి నికర జలాలు అందించాలని, మడకశిర బ్రాంచ్ కెనాల్‌లో పూడిక తీసి కంప చెట్లు తొలగించాలని, కాలువ పర్యవేక్షణకి 10 కి.మీకి ఒక లస్కర్‌ను ఏర్పాటు చేయాలని జల సాధన సమితి డిమాండ్ చేస్తుందన్నారు. అలాగే కాలువ మధ్యలో, రహదారుల వద్ద ఏర్పాటు చేయాల్సిన బ్రిడ్జిలను పూర్తి చేయకుండి వదిలేయడంతో పలుచోట్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం, సంబంధిత కాంట్రాక్టర్లు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, సోము, నర్సగౌడ్, ఉమేష్‌నాయక్, శశికుమార్ హనుమంతరాయప్ప, గోవిందప్ప, పాల్గొన్నారు

# కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

## ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్




సమావేశంలో పాల్గొన్న నాయకులు

చేనేత కార్మికుల సమస్యలపై ఈ నెల 19వ తేదీ కలెక్టరేట్ ధర్నా చేపట్టనున్న ధర్నాకు చేనేత కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత కార్మికుల సమస్యలు, ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నామ న్నారు. చేనేత రంగానికి జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని, 11రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, చేనేతలకు కేటాయించిన 11 రకాలు పవర్‌లూమ్స్ తయారుకాకుండా చర్యలు తీసుకోవా లని, ముద్రారుణాలు, ప్రతి కుటుంబానికి ఆంక్షలు లేకుండా రూ. 1 లక్ష రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత సంఘం నాయకులు చౌడప్ప, వెంకటస్వామి, వెంకటరాముడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-బుక్కపట్నం

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుక్కపట్నంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుని సాధ్యమైన వాటిని అక్కడికక్క డే పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అభివృద్ధి చేసింది శూన్యమని, వైసిపి ప్రభుత్వంలోనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచి నాగలక్ష్మిరాజు, ఎంపిపి శ్రీధర్ రెడ్డి, శ్రీలత గోవర్ధన్ రెడ్డి, వైస్ ఎంపిపి పార్వతి, ఉప సర్పంచి గౌరమ్మ, నాయకులు పతాంజలి, రామలింగారెడ్డి, మల్లికార్జున, నాగభూషణం, నారాయణస్వామి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

**పరిగి:** రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి 175 సీట్లను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచి బాలాజీ పాల్గొనకపోవడం విమర్శలకు దారి తెలిసింది. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నరసింహమూర్తి, మండల నాయకులు ప్రభాకర్, డివి రమణ, శివశంకర్, మారుతిరెడ్డి, నరసింహారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



పరిగిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు


గ్రాడ్యుయేషన్ డే లో మాట్లాడుతున్న సిడిపిఒ రెడ్డి రమణమ్మ

## లేపాక్షిలో గ్రాడ్యుయేషన్ డే

**లేపాక్షి :** లేపాక్షి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ రెడ్డి రమణమ్మ హాజరై పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎలిమెంటరీ విద్యకు వెళ్లడానికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అంజనరెడ్డి , సూపర్ వైజర్ జయమ్మ, మహిళా పోలీస్ ఉష, అం గన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, భాగ్యమ్మ, సిబ్బంది, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైల్వే రోడ్డును సమగ్రంగా అభివృద్ధి చేస్తాం:కమిషనర్

**హిందూపురం:** పట్టణంలోని రైల్వే రోడ్డును సమగ్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. పట్టణ ప్రణాళిక ఎసిపి ఆనంద్‌కుమార్‌తో కలిసి శనివారం కమిషనర్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాలువ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంకా ఆక్రమణలు ఉన్నాయని, వాటిని సైతం తొలగించి రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వారి వెంట మున్సిపల్ ఇంజనీర్లు ఉన్నారు.

## బాలికల జూనియర్ కళాశాల తనిఖీ

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని ప్రభుత్వ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శనివారం కడప ఆర్జేడీ రవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ఆవరణలో నాడు–నేడు కింద జరుగుతున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అడ్మిషన్లు, రిజిస్టర్ మీద సమీక్ష చేసి ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. అధ్యాపకుల టీచింగ్, డైరీలను పరిశీలించారు. ఆర్జేడీ వెంట ఆర్‌ఎస్ఐఓ సురేశ్, డీవీఈఓ రఘునాథరెడ్డి ఉన్నారు.

## రీసర్వేకి రైతులు సహకరించండి

**కొత్తచెరువు :** కొత్తచెరువు రెవెన్యూ పొలంలో ఈ నెల 19వ తేదీ నుంచి భూముల రీసర్వే చేస్తారని రైతులు సహకరించాలని డివిజన్ సర్వేయర్ శేఖర్, విఆర్వోలు వేణుగోపాల్, శ్రీనివాసులు తెలిపారు. గ్రామ సచివాలయం–1లో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీసర్వేలే భాగంగా భూ సమస్యలను పరిష్కరిస్తామని, కావున రైతులు వారి పొలాల వద్దకు వచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, సచివాలయ సర్వేయర్ దాదు పాల్గొన్నారు.

## నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు

**పెనుకొండ :** నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. ఫైనల్ ఇయర్ సైన్స్ విద్యార్థులకు "పుట్టగొడుగులు పెంపకం, శుద్ధి, మార్కెటింగ్, ప్యాకింగ్, వివిధ ఆధారిత ఉత్పత్తులపై శ్రీ సమతా గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి పర్యవేక్షణలో 6 నెలల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ ముగిసిన సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు శిక్షణ ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. సమావేశంలో ఏఓ కేశవయ్య, అధ్యాపకులు భాస్కర్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు బిసి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

**లేపాక్షి:** జిల్లాలోని టేకులోడు, గుడిబండ, బుక్కపట్నం, నసనకోట, లేపాక్షి, రొద్దం–1, రొద్దం–2, గుండుమల, పేరూరు, రేగాటిపల్లి బిసి సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులకు వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం(నేడు) పరీక్ష నిర్వహిస్తామని మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాల కన్వీనర్, ప్రిన్సిపల్ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న పాఠశాలలో ఉదయం 10 గంటలకు పరీక్ష ఉంటుందని, ప్రతిభ ఆధారంగానే విద్యార్థులను చేర్చుకుంటామన్నారు.

## వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**ఓబుళదేవరచెరువు:** స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాలుర విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని హెచ్‌డబ్ల్యూఓ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వసతి గృహంలో 55 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వసతి గృహం కదిరి మెయిన్ రోడ్‌లో కెజిబివి స్కూల్ ఎదురుగా ఉందని, మరిన్ని వివరాలకు 94905 93115 నంబర్‌లో సంప్ర దించాలన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**రొద్దం :** మండల పరిధిలోని బూచెర్ల, లోచర్ల పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపిడిఓ రాబర్ట్ విల్సన్ సందర్శించిరు. ఈ సందర్భంగా ఆయన పనులు సక్రమంగా చేయాలని కూలీలకు సూచించారు. అలాగే ఉపాధి కూలీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు, బూచెర్ల పంచాయతీ సర్పంచి సోమిరెడ్డి, తదితరులు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ రాబర్ట్ విల్సన్

# 'జగనన్న సురక్ష'ను పకడ్బందీగా నిర్వహిస్తాం

## కలెక్టర్ అరుణ్ బాబు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు వివరించారు. 'సురక్ష కార్యక్రమం'పై శనివారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్ గుప్తా, కార్యదర్శి ముత్యాలరాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 32 మండలాల పరిధిలో జులై 1 నుంచి 31వ తేదీ వరకూ 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో తహశీల్దార్లు, ఎంపిడిఓల టీములు, మున్సిపల్ కమిషనర్ టీంల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపడతామన్నారు. వాలంటీర్ల చేత ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ కొండయ్య, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్లు భవానీశంకర్, మధులత, హౌసింగ్ పిడి చంద్రమౌళిరెడ్డి, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డ్వామా పిడి రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, నోడల్ అధికారి శివారెడ్డి, డిపిఓ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శివరంగప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

### 'జగనన్న సురక్ష' పథకంపై సమావేశం

**బత్తలపల్లి :** వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, మండలస్థాయి అధికారులు సహకారం అందిస్తారని ఎంపిడిఓ శ్రీదేవి, ఈఓఆర్‌డి దివాకర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులు, వాలం టీర్లు, గృహ సారథుల విధి నిర్వహణపై వివరిం చారు. సమావేశంలో సచివాల య ఉద్యోగులు, వలంటీర్లు, గహసారథులు, పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ అంజనప్ప, తహశీల్దార్ నటరాజన్ అధ్యక్షతన మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లకు 'జగనన్న సురక్ష' పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

# పోలీసులు ప్రజలతో మమేకమవ్వాలి

**రొద్దం :** సచివాలయ మహిళా పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్ఐ నాగస్వామి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం సచివాలయ మహిళా పోలీసులు, స్థానిక పోలీసులకు పెనుకొండ ఎక్స్ఛేంజ్ సిఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యం లో 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకం కావాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఏ నెంబర్ కి ఫోన్ చేస్తే ఏ విధమైన చర్యలు ఉంటాయో అనే విషయంపై ప్రజలకు వివరిం చాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడు తున్న 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' కార్యక్రమంపై సీఐ సుబ్బారెడ్డి అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, వాటిపై నియమ నిబంధనలను వారికి సూచించి, వాటి నివారణకు చర్యలు ఏవిధంగా తీసుకోవాలి అనే అంశంపై వివరించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో సీఎం జగన్ విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని అప్పరాచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగిన 'జగనన్న విద్యా కానుక' కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి త్రివేణిరెడ్డి, ఎంఈఓ చాముండేశ్వరి హాజరై కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపిపి త్రివేణి, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి భయపరెడ్డి దంపతులు, సర్పంచి శారదమ్మ, సత్యనారాయణరెడ్డి దంపతులను ఉపాధ్యాయ బృందం శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అలివేలుమంగమ్మ, ఉపాధ్యాయులు జయప్రద, ప్రమద, గోవిందరాజు, కిషోర్‌బాబు, లక్ష్మీనారాయణ, జయపాల్ రెడ్డి, మునిస్వామి, భాస్కర్, ఉమామహేష్, సిఆర్‌పి వెంకటరమణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యా సామాగ్రి అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఎంపీపీ తదితరులు

# ఆర్టీసీ బడిబస్సులు నడపాలి:ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-హిందూపురం**

పరిగి మండల పరిధిలోని శ్రీరంగ రాజులపల్లి గ్రామానికి బడిబస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి పేర్కొన్నారు. ఈ విషయంపై శనివారం ఆర్‌టిసి డిపో మేనేజర్ కార్యాలయం ముందు ఆందోళన చేసి అనంతరం అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు శ్రీరంగరాజుపల్లి, గొర్రెపల్లి, బిందునగర్, సేవా మందిర్ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. అయితే ఆయా గ్రామాలకు బడి బస్సులు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బస్సులు నడపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో డిపో కార్యలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష కుమార్, భగత్, వినోద్, రామాంజి, సాయి, మహేష్, గిరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్‌టిసి అధికారికి వినతి ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


# గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ

**బత్తలపల్లి :** మండల వ్యాప్తంగా ఉన్న గొర్రెలు, మేకలే జీవనోపాధిగా ఆధారపడి ఉన్న గొర్రెలకాపరులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామంలో శనివారం నట్టల నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడం జీవాలు ఆరోగ్యంగా ఉంటూ రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యమైన పిల్లలు పుడతాయన్నారు. పశు వైద్యశాలలో ముచ్చు వ్యాధి, నీలినాలుక వ్యాధికి టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గొర్రెలకాపరులు జీవాలకు బీమా చేయించుకోవాలని సూచించారు.

# పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకో : 'చిలకం'

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

జనసేనపార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై మరోసారి నోరు పారేసుకుంటే తాట తీస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మాజీ మంత్రి పేర్ని నానిని హెచ్చరించారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి మంత్రి పదవులు తొలగించడంతో మతిభ్రమించిన పేర్ని నాని, కొడాలి నాని పవన్‌కల్యాణ్‌పై లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలను ఆదుకోవా లనే ఉద్దేశ్యంతో వారాహియాత్ర చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారన్నా రు. వారాహి యాత్రతో వైసీపీ నాయకుల గుండెల్లో వణుకు పుట్టిందన్నారు. జగన్‌రెడ్డి లాంటి దుర్మార్గ మైన వ్యక్తులు అక్కడ లేరు కావున సుమలత గెలిచారని గుడివాడ నానికి హితవు పలికారు. వైసిపి గుండాలను ఎదుర్కొనే సత్తా ఒక్క పవన్ కల్యాణ్‌కే ఉందన్నారు.


మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

# నిరసన తెలిపితే అరెస్టులా?: సవితమ్మ

**పెనుకొండ:** జగన్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలపటం కూడా నేరమా అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కృష్ణాజిల్లాలో సీఎం జగన్ పర్యటనలో నిరసన తెలిపిన దళిత మహిళ అసలేటి నిర్మలను అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు మహిళలే బుద్ధి చెబుతారని ఆమె పేర్కొన్నారు.

**పుట్టపర్తి అర్బన్ :** కృష్ణా జిల్లాలో దళిత మహిళ నిరసన తెలిపినందుకు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో మంజూరైన ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకోగా వైసిపి కార్యకర్తలకు ఇస్తుంటే ఇది తప్పు అని నిరసన తెలిపినందుకే ఆమెను ఈడ్చుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో వేశారన్నారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలు రాష్ట్రంలో నిత్యం జరుగుతున్నాయని, రాబోయే ఎన్నికల్లో మహిళలే వైసిపికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


జిల్లా టాపర్ సాజియా, ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

# 'కస్తూరిబా' విద్యార్థినికి కలెక్టర్ సన్మానం..

**ప్రజాశక్తి-లేపాక్షి:** స్థానిక కస్తూరిబా పాఠశాల విద్యార్థిని తనూజని శనివారం కలెక్టర్ అరుణ్‌బాబు పుట్టపర్తిలో సన్మానించడంతో పాటు రూ. 50వేల నగదు అందజేశారు. అలాగే జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ నీలిమను సన్మానించారు. భవిష్యత్తులో పాఠశాల విద్యార్థినులను బాగా చదివించాలని సూచించారు.

**హిందూపురం:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని సాజియా 2022–23లో ఇంటర్‌లో 962 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచి అనంత ఆణిముత్యంకు ఎంపికైంది. దీంతో శనివారం విద్యార్థినితో పాటు తల్లి, కళాశాల ప్రిన్సిపల్ మురళి మోహన్‌ను కలెక్టర్ అరుణ్‌బాబు, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి ఘనంగా సన్మానించి, రూ. 50వేల చెక్కును విద్యార్థికి అందించారు.

**ధర్మవరం టౌన్ :** 'అనంత ఆణిముత్యాలు' పథకం విద్యార్థులకు వరం లాంటిదని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మేరీ వరకుమారి తెలిపారు. అనంత ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 3వ స్థానంలో నిలిచిన విద్యార్థిని టి.ముబాసిరకు శనివారం కలెక్టర్ అరుణ్ బాబు నగదుతో పాటు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారని తెలిపారు. విద్యార్థినిక హెచ్‌ఎంతో పాటు టీచర్ రాము, ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# ముళ్లపొదలు తొలగించండి

**గోరంట్ల రూరల్:** మండల పరిధిలోని కమ్మువారిపల్లె నుంచి వానవోలు గ్రామానికి వెళ్లే రహదారిలో రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా రోడ్డుకు అడ్డంగా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని రైతులు కోరారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు, ఏదైనా పనిపై వానవోలుకి ద్విచక్ర వాహనాలు, ఎద్దుల బండ్లపై వెళ్లాలంటే వీలు లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతుల వ్యవసాయ భూములు కట్ట అవతల వైపు ఉన్న కారణంగా ఈ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని తెలిపారు. కట్టపై ఇరువైపులా చెట్లు ఏపుగా దట్టంగా పెరగడంతో కనీసం నడవడానికి కూడా వీలులేకుండా పోయిందని, ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోయారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కట్టమీద రహదారిని పరిశీలించి, గ్రామ రైతులు రాకపోకలు సాగించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.


రోడ్డుకు అడ్డంగా దట్టంగా పెరిగిన ముళ్లపొదలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**హిందూపురం:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంఇఓ గంగప్ప విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హైస్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం పాఠశా ల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులు మున్సిపల్ కమిషనర్, ఎంఇఓ పాఠశాలలో పదేళ్లు విధులు నిర్వహించిన సిబ్బందిని సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. అలాగే పాంచజన్య శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ శ్రీనివాసులు విద్యాలయాన్ని స్థాపించి, విద్యార్థులకు స్కాలర్ షిప్ అందించడం అభినందనీయమన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులను సమాజాభివృద్ధికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నా మన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రియాజ్, పాఠశాల ఉపాధ్యక్షులు సందీప్, సెక్రటరీ నందకుమార్, స్కూల్ డైరెక్టర్లు భారతిశ్రీనివాస్, సత్య, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత కృష్ణ, పాల్గొన్నారు.

## ఎఎస్ఓగా ఎంపికైన ధర్మవరం వాసి

**ధర్మవరం టౌన్:** పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన కట్టా రెడ్డప్ప, శ్యామల దంపతుల కుమార్తె హేమలత ఏపీపీఎస్సీ నిర్వహించిన ఏఎస్ఓ పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో హేమలత విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ రాష్ట్ర కార్యాలయంలోగా నియామకం పొందినట్లు తండ్రి రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ మా నాన్న ధర్మవరం పట్టణంలో ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, భర్త వెంకటేశులు సహకారంతో ఏఎస్ఓగా ఉద్యోగం సాధించానని తెలిపింది. భర్త వెంకటేశులు అనం తపురం ఆర్ట్స్ కళాశాలలో సాంఖ్యక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నారన్నారు.

## వెంకటేశ్వర్‌రెడ్డిపై చర్యలకు టిడిపి డిమాండ్

**కదిరి అర్బన్:** బాపట్లలో అమర్నాథ్‌గౌడ్(17) అనే బాలుడు బతికి ఉండగానే పెట్రోల్ పోసి తగలబెట్టిన వైసిపి నేత వెంకటేశ్వర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బిసి సంఘం అధ్యక్షులు ఖాదర్‌బాదర్, నాగప్ప ఆధ్వర్యంలో స్థానిక పూలే విగ్రహం కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కృష్ణమూర్తి, జోగన్నపేట రాజు, నరసింహులు, సులేమాన్, సుధాకర్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

**బత్తలపల్లి :** ఇరువర్గాల దాడుల్లో గాయపడిన మండల నరసింహులు వైద్య పరీక్షల నిమిత్తం ఏపీ కురుల కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. నరసింహులు బెంగుళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కోటి సూర్యప్రకాష్ బాబు శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అలాగే అతడి భార్య హోసూరమ్మకు రూ. 20వేలు అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సాకే గోపాల్, కొండారుపల్లి శేఖర్ ఉన్నారు.

## ఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులుగా నాగళ్ల సురేష్

**ఓబుళదేవరచెరువు:** నవ సమాజ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా కె.రాజు ఎన్నికయ్యారు. అలాగే పుట్టపర్తి నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఓబులేసు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నీరుగుట్టు నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయుడు హాజరయ్యారు. పుట్టపర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా యశ్వంత్, సహాయ కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా సురేష్, కమిటీ సభ్యులుగా మణికంఠ, నరేష్‌లను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఓబులేసు, అక్కమ్మగారి సురేష్, అమర పాల్గొన్నారు.

## టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా ఆంజనేయులు

**ఓబుళదేవరచెరువు:** టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా మండల పరిధిలోని నల్లగుట్టపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులును ఎంపిక చేసినట్లు శనివారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు. అలాగే ఎంపికకు సహకరించిన పల్లె రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జయచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

# నేరాలు ఘోరాలు

## ఇరువర్గాల ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

**బత్తలపల్లి :** బత్తలపల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఇరువర్గాల ఘర్షణలో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. బత్తలపల్లికి చెందిన ఎరుకల వేణు, మారుతీనగర్‌కు చెందిన బోయ గోపాల్ శుక్రవారం మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు. ఇది కాస్త రెండు కులాల మధ్య ఘర్షణకు దారి తీసింది. దీంతో ఇరువర్గాలు కవ్వింపు చర్యలకు దిగగా పోలీసులు చెదరగొట్టారు. రాత్రి 11 గంటల సమయంలో మరోమారు పరస్పరం దాడులు చేసుకోగా మునీంద్ర, శ్రీనివాసులు, మందల నరసింహులు, రమణ, గణేష్, గవ్వల రమేష్‌కు గాయాలయ్యాయి. మునీంద్ర, నరసింహులుకు తీవ్రగాయాలు కావడంతో ఒకరిని కర్నూలు, మరొకరిని బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి, పోతుకుంట ఎస్ఐలు టీవీ శ్రీహర్ష, ప్రదీప్‌కుమార్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఎస్టీ కాలనీలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. శనివారం ఇరువర్గాల వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం సృష్టించినా, ఘర్షణలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు.

## జూదరులు అరెస్టు

**చిలమత్తూరు :** మండల పరిధిలోని సంజీవరాయినపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు చాకచక్యంగా వ్యవహరించి పేకాట స్థావరంపై దాడులు చేయగా నలుగురు పట్టుబడ్డారని, వారి నుంచి రూ. 18 వేల నగదు, 2 ద్విచక్రవాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

## పట్టపగలే బరి తెగించిన దుండగులు

**పరిగి :** ఇటీవల కాలంలో మండల వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన దోపిడీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమందేపల్లి మండల పరిధిలోని రుకులపల్లికి చెందిన లక్ష్మీనారాయణ హిందూపురం బ్యాంకులో వ్యవసాయ రుణం రెన్యువల్ కోసం రూ. 15 వేలు నగదు తీసుకొని వస్తూ ఉండగా వంగలపల్లి సమీపంలో ముగ్గురు దుండగులు ద్విచక్ర వాహనంపై వెంబడించి అతడిని చితకబాది నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారైనట్లు బాధితుడు పోలీసులకు వివరించారు.

## మున్సిపల్ కమిషనర్ మృతికి సంతాపం

**ధర్మవరం టౌన్ :** గతంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కన్యాకుమారి శనివారం మృతి చెందారు. ఆమె టిడిపి ప్రభుత్వ హయాంలో ఏడాది పాటు కమిషనర్‌గా మున్సిపాలిటీలో సేవలందించారు. ఆ తర్వాత బదిలీపై ఆదోనికి వెళ్లారు. ఇటీవల అనారోగ్య సమస్యలు అధికం కావడంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీంతో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మేనేజర్ ఆనంద్, అధికారులు, సిబ్బంది ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు.

## ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

**కదిరి అర్బన్ :** ఉన్నత స్థాయికి ఎదిగి పది మందికి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని మల్లయ్యగారిపల్లి తండాకు చెందిన వైసిపి నేత కె.వెంకటరమణనాయక్ కుమార్తె లావణ్యబాయి ఇంటర్‌లో (బైపిసి) జిల్లా మొదటి ర్యాంకు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థినిని అభినందించి సహాయ సహకారాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

## చీనీ మొక్కల పెంపకం పనులు ప్రారంభం

**ధర్మవరం టౌన్ :** మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో రైతు నరసింహారెడ్డి పొలంలో శనివారం ఎంపిడిఓ సౌజన్యకుమారి ఆధ్వర్యంలో చీని మొక్కల పెంపకం కోసం గుంతలు తవ్వి, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా, వివిధ రకాల పండ్ల తోటల పెంపకం కోసం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో అనిల్‌కుమార్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శంకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని 21వ వార్డు నుంచి 40వ వార్డుల వరకు వార్డుల వారీగా సెక్షన్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలకు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం(నేడు) శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని శనివారం ఆ పార్టీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హాజరై దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు సెక్షన్, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జిల్లు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, వార్డు అధ్యక్షులు తప్పకుండా హాజరు కావాలన్నారు..

**తనకల్లు:** కదిరి పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం(నేడు) ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కావున మండల వ్యాప్తంగా ఉన్న టిడిపి కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

## 'వివేకానంద' యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

**చిలమత్తూరు :** అర్థాంతరంగా కళాశాలను మూసివేసేందుకు సిద్ధమైన వివేకానంద డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి అనంతరం తహశీల్దార్ నాగరాజుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న 170 మంది విద్యార్థుల చదువు పూర్తయ్యే వరకూ కళాశాలను నడపాలని లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### 'దేవరాయ' స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

కనీస వసతులు కల్పించని దేవరాయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరుకైన తరగతి గదులు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, ఆటస్థలం, అగ్నిమాపక శాఖ అనుమతులు లేకపోయినా పాఠశాల, హాస్టల్ నడుపుతున్నారని ఆరోపించారు. విద్యార్థి జెఎసి నాయకులు సంపత్‌కుమార్, బాబావలి, రవికుమార్, నాగభూషణం, వెంకటాపురం అభి, చంద్రశేఖర్ రెడ్డి, హర్షకుమార్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


శ్రీనివాసడిగ్రీకళాశాల విద్యార్థులతో ప్రిన్సిపల్

# ఏపీ ఐసెట్‌లో 'ప్రయివేటు' విద్యార్థుల ప్రతిభ

**ధర్మవరం టౌన్ :** ఏపీ ఐసెట్‌లో పట్టణంలోని శ్రీనివాస, సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రీనివాస డిగ్రీ కళాశాలకు చెందిన తరుణ్(5,052), సురేశ్(8,750), శివ (13,144), ప్రవీణ(25,411), శ్యామ్ 16,842), దస్తగిరి(25,400), బాబు (31,000), జాహ్నవి (11,455), మదన్‌మోహన్‌రెడ్డి(14,290) ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి తెలిపారు. వీరిని ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు. సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రావణి(1,422), పర్వీన్‌బను(4,766), సింధూ తులాని(5,055), దుర్గాభవాని(5,591), ప్రమీద (5,629), వీణాకుమారి (6,471), అఖిల(7,998), తరునిసాయి(8,097), లక్ష్మీచిన్మయి (9,964), చైతన్య(10,184) ర్యాంకులను సాధించారని కరస్పాండెంట్ దోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున తెలిపారు. వీరిని కరస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


విద్యార్థులతో సత్యకృప కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్



పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

## కుష్టు నిర్మూలనకు కృషి

**ప్రజాశక్తి-అనంతపురం**

కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహనపై సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ముందుగా ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 26 నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకూ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్తలు, కుష్టువ్యాధి సర్వే వాలంటీర్లు రోజూ 20 నుంచి 35 ఇళ్లను సర్వే నిర్వహించి ఇంట్లోని సభ్యులకు కుష్టి వ్యాధి గురించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే అనుమానితులను గుర్తించాలన్నారు. అనుమానిత లక్షణాలున్న వారిని గ్రామాలకు దగ్గరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులకు పరీక్ష నిమిత్తం పంపాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే అక్కడినుండి పట్టణ ఆరోగ్య కేంద్రమునకు రిఫర్ చేసి వైద్యం అందించాలన్నారు. ఈ కుష్టు వ్యాధి చికిత్సకు వైద్యం ఉచితంగా అందించబడుతుందని తెలిపారు. కుష్టు వ్యాధి వల్ల అంగవైకల్యం పొందిన వ్యాధిగ్రస్తులకు అంగవైకల్యం సరి చేయుటకు పలమనేరు ఆసుపత్రిలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ కృష్ణవేణి, మరియు జిల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి-అనంతపురం**

స్థానిక రెండవ రోడ్డులోని వైఎస్ఆర్ పార్టీ కార్యాలయం సమీపంలో ఉన్న కూడలి వద్ద శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో డిపి షుగర్ వంటి సమస్యలను నిర్ధారించి నిర్ధారించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ రెడ్డి మిత్ర బృందం ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

**ప్రజాశక్తి-నార్పల**

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నార్పల క్రాస్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. నేరాల నియంత్రణ మరియు నేరాల గుర్తింపులో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడత్యాన్నారు. అలాగే మంచి పనుల కోసం ప్రజలకు సేవ చేయడం కోసం అనంతపురం పోలీస్ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ప్రజలు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది, దాతలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

# 'జగనన్న సురక్ష'ను పటిష్టంగా అమలు చేయాలి



గుత్తిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు

**ప్రజాశక్తి-పుట్లూరు**

ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో భాగంగా ఈనెల ఈనెల 23 నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకూ నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్షా కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ఏ ఇంటికి సంబంధించి ఏ రకమైన వినతి అయినా.. ఏదైనా పత్రాలకు సంబంధించిగానీ, డెత్, ఇన్‌కం, మ్యారేజీ సర్టిఫికెట్లకు సంబంధించిగానీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా? లేవా? అన్నదానిపై జల్లెడ పట్టాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్, ఒక టీం, తహశీల్దార్, ఇఒ పంచాయతీరాజ్ కలిసి రెండు టీమ్‌లుగా ఏర్పడతాయన్నారు. ఈ రెండు బృందాలు గ్రామాలకు వెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

**నార్పల :** ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం కోసం ఈనెల 23 నుంచి వచ్చేనెల 23వ తేదీవరకూ నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపిడిఒ దివాకర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వివిధ శాఖల సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** జగనన్న సురక్ష ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ విజయభాస్కర్ సూచించారు. శనివారం మండలంలోని ఓబులాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం హౌసింగ్ డే సందర్భంగా దయ్యాలకుంటపల్లి జగనన్న లేఔట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఈనెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

**గుత్తి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గ్రామస్థాయి సచివాలయంలో నెలకొన్న సమస్యలను ఎలా పరిష్కరించాలో అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి పాల్గొన్నారు.

**గార్లదిన్నె :** మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ వెల్ఫేర్ సహాయకులు, డిజిటల్ సహాయకులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజోష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**హిందూపురం:** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పిలుపునిచ్చారు. పట్టణంలోని టిటిడి కల్యాణ మంటపంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వార్డు సెక్రటరీలు, వాలంటీర్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీన సుల్తాన పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా అధికారులు, సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని 13 సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ సిద్ధారెడ్డి, తహశీల్దార్ రామాంజ నేయరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వాలంటీ ర్లు పాల్గొన్నారు.

**నల్లచెరువు:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ శకుంతల ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి వారికి అందాల్సిన ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలపై ఆరా తీయాలన్నారు. ఏ గ్రామానికి వెళ్లాలో ముందుగా వారికి సమాచారం ఇచ్చి బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ క్రాంతికుమార్, ఆర్ఐ అశోక్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయభాస్కర్

**ఓబుళదేవరచెరువు:** ప్రజా సమస్యలను పరిష్కరించడం, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ఈ నెల 23 నుంచి జూలై 23వ తేదీ వరకూ జగనన్న సురక్ష కార్యక్రమా న్ని చిత్తశుద్ధితో అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రమేష్ సూచిం చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో రమేష్ మాట్లాడు తూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురించి వివరించాలన్నారు. సమావేశంలో ఎంపిపి పర్వీన్‌బాను, తహశీల్దార్ శ్రీధర్, ఏవో పూల రెడ్డప్ప, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

**సోమందేపల్లి :** ప్రజల సమస్యల పరిష్కారమే 'జగనన్న సురక్ష' లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం 'జగనన్న సురక్ష'పై నిర్వహించిన కార్యక్రమంలో డిఎల్‌పిఒ శివారెడ్డి, తహశీల్దార్ సురేష్‌కుమార్, ఎంపిడిఒ నాగరాజురావు, ఎంఈఓ ఆంజనేయనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయా ల్లో సుమారు 30 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి:** స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, గ్రామ రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లతో ఎంపిడిఒ నరసింహనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ బాబు హాజరై జగనన్న సురక్ష పథకం గురించి వివరించారు. సమావేశంలో ఈఓఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, దుర్గయ్య, ఆనంద్ కుమార్, గ్రామం రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# 'ఆణిముత్యాలు'కు బహుమతుల ప్రదానం

**ప్రజాశక్తి-పుట్లూరు**

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమదులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు పల్లవి, శ్రావణి, లహరి, శ్రేయకు పతకాలు, సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాబు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** మండలంలోని గురుకుల పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురుకుల గిరిజన సంక్షేమ జిల్లా అధికారి అన్నా దొర, ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ 2022-23లో పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో బహమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే సిద్ధరాంపురం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో సమూల మార్పులు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**యాడికి :** జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణి మార్కులతో పాసైన ముగ్గురు విద్యార్థినులను శనివారం ఘనంగా సన్మానించడంతోపాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేకాధికారిణి నిర్మల మాట్లాడుతూ అత్యుత్తమ మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి మన పాఠశాల బాలికలు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** జగనన్న అణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కళ్లీమఠం మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్‌పర్సన్ లక్ష్మి, వైస్‌ఛైర్మన్ సోమ రవి, వార్డు ఇన్‌ఛార్జి పోరాళు శివ పాల్గొన్నారు.